రాబడి

ఈటీఎఫ్‌లంటే ఏంటో తెలుసా?

- ఈటీఎఫ్‌లు ఈక్విటీ, డెట్, కమోడిటీస్ వంటి వివిధ రకాల సాధనాల కోసం అందుబాటులో ఉంటాయి.
- సాధారణంగా వీటికయ్యే వ్యయభారం తక్కువే. అయితే ఈటీఎఫ్‌ల క్రయవిక్రయాల్లో బ్రోకరేజీ ఫీజులు, ఇతరత్రా ట్రేడింగ్ ఖర్చులు తప్పవు.
- ట్రేడింగ్ జరిగే రోజున ఈటీఎఫ్‌లను నాటి మార్కెట్ ధరల వద్దే కొనవచ్చు.. అమ్మవచ్చు.
- ఒక సూచీ ప్రదర్శనను ప్రతిబింబించడమే ఈ ఈటీఎఫ్‌ల లక్ష్యం.
- మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే దేశంలో అందుబాటులో ఉన్న ఈటీఎఫ్‌లు పరిమితం.
- ఆన్‌లైన్ బ్రోకర్లు, సంప్రదాయ బ్రోకర్-డీలర్ల ద్వారా ట్రేడ్ అవుతాయి.
- ఇండివీడ్యువల్స్ తమ రిటైర్మెంట్ ఖాతాల్లోనూ వీటిని కొనవచ్చు.

లాభాల స్వీకరణకు అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతున్నాయి. మదుపరులు కొనుగోళ్ల జోష్‌లో ఉన్నారు. ఫలితంగానే గత వారం సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు లేదా 1.57 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 82,365.77 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ సైతం 412.75 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి తొలిసారి 25,235.90 దగ్గర ముగిసింది. కాగా, మార్కెట్లు నూతన గరిష్ఠాల వద్ద ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేసే వీలుందని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ వారం కరెక్షన్‌కు అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,850 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,500-25,700 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఇలా.. ప్లాన్ చేసుకోండి

సీనియర్ సిటిజన్ల పెట్టుబడికున్న 10 అత్యుత్తమ మార్గాలివే

ఆర్థిక ప్రణాళికలో పొదుపు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అవగాహన, వివేకంతో ముందుకెళ్తే ఆకర్షణీయ స్థాయిలో రాబడులను పొందవచ్చు. ఇక సాధారణ సిటిజన్స్‌తో చూస్తే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకున్న 10 అత్యుత్తమ మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే వాటిలో..

1

• సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం

పదవీ విరమణ పొందినవారు ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల గురించే ఆరా తీస్తూ ఉంటారు. సురక్షిత, స్థిరమైన ఆదాయ వనరును కోరుకుంటారు. అలాంటి వాటిలో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్‌ఎస్) ఒకటి. ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. ప్రతీ 3 నెలలకోసారి సవరిస్తారు. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. ఈ స్కీం గరిష్ఠ పరిమితి 5 ఏండ్లు. ఈ పెట్టుబడి మొత్తాలు పన్ను పరిధిలోకి రావు. అయితే వీటిపై పొందే వడ్డీ ఆదాయం వారివారి ఐటీ స్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

2

• పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం

తపాలా శాఖ అందించే ఈ స్కీంలో పెట్టుబడులకుగాను నెలనెలా నిర్ణీత స్థాయిలో వడ్డీ ఆదాయాన్ని పొందవచ్చు. రిటైర్మెంట్ వయసులో ఆర్థిక భద్రతకు చక్కని అవకాశం. అయితే సీనియర్ సిటిజన్లకే కాదు.. 10 ఏండ్లు దాటిన భారతీయ పౌరులెవరైనా ఇందులో పెట్టుబడులకు దిగవచ్చు. దీని వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. ప్రతీ 3 నెలలకోసారి మారడానికి ఆస్కారం ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. ఆ తర్వాత మరో 5 ఏండ్లు కూడా పొడిగించుకోవచ్చు. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి.

3

• ఫిక్స్‌డ్ డిపాజిట్లు

రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లే (ఎఫ్‌డీ) ఇవి. బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అలాగే నెలవారీగా, 3 నెలలవారీగా, వార్షిక ప్రాతిపదికన నగదునూ పొందవచ్చు. మార్కెట్ రిస్కులకు దూరంగా ఉంటూ సురక్షితమైన పెట్టుబడులను, స్థిరమైన ఆదాయాన్ని ఆశించేవారు ఈ ఎఫ్‌డీలను పరిశీలించవచ్చు.

4

• సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. నెలనెలా మనం చేసే ప్రతీ డిపాజిట్‌ను ఓ ఎఫ్‌డీగానే చూస్తారు. తక్కువలో తక్కువగా రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ స్కీం. వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.

5

• నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం. పదవీ విరమణ కాలంలో స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగులకు ఇది చక్కని పథకమనే చెప్పవచ్చు. ఉద్యోగుల నుంచి, వారి సంస్థల తరఫు నుంచి ఇందులోకి నగదు జమవుతుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద పన్ను ప్రయోజనాలు దక్కుతాయి.

6

• సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం



60 ఏండ్లు, ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి వచ్చినదే ఈ సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) స్కీం. బ్యాంకులను బట్టి డిపాజిట్లకున్న కనీస, గరిష్ఠ పరిమితులు ఆధారపడి ఉంటాయి. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లదాకా ఉంటుంది. వార్షిక వడ్డీరేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఎఫ్‌డీల తనఖాపై రుణాలనూ పొందవచ్చు. మీ డిపాజిట్లపై రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. రూ.50వేల దాకా పన్ను మినహాయింపుంటుంది.

7



• ట్యాక్స్ ఫ్రీ బాండ్లు

ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవారికి చెల్లించే వడ్డీకి పన్ను మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరఫున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

8



• ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్‌ఎస్‌ఎస్) అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు లేదా వాటి సంబంధిత సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. అయితే ఇందులో రిస్క్ ఉంటుందన్న విషయం మరువద్దు. అయినప్పటికీ వేచిచూస్తే పెట్టుబడులపై మంచి ఆదాయాన్ని సొంతం చేసుకోవచ్చు. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు మరి. ఇక ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే వీటిల్లో లాకిన్ పీరియడ్స్ ఉంటాయి.

9

• మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు మార్కెట్ రిస్కులకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది. నిజానికి రిస్కులకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఇవి పనికిరావు. ఈక్విటీ, రుణ మార్కెట్లలో మీ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు కారణం. అయితే ధైర్యంతో నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ఆకర్షణీయ రాబడులనే అందిస్తాయని చెప్పవచ్చు. కాబట్టి నిపుణుల సలహా మేరకు మీ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్స్‌కూ కొంత భాగం ఇవ్వవచ్చు. లాభాలపై మూలధన లాభాల పన్నులుంటాయి.

10

• పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

సీనియర్ సిటిజన్లకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) కూడా ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇదో సురక్షిత పెట్టుబడి మార్గం. పీపీఎఫ్‌లో పెట్టుబడి ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు.

నిండా ముంచిన నిర్లక్ష్యం

- **రాత్రికి రాత్రే మునిగిన మణుగూరు**
- **దిక్కుతోచక ఇంటి సామన్లతో భవనాల పైకి ఎక్కిన ప్రజలు**
- **పరిస్థితిని పర్యవేక్షించిన కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ఎస్పీ**
- **బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించిన పోలీసులు**

పరిస్థితిని పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ రోహిత్

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 1: అధికారుల నిర్లక్ష్యం, జోరు వాన, అక్కడక్కడా జరిగిన ఆక్రమణలు, సింగరేణి డంప్‌యార్డ్‌లపై నుంచి వచ్చిన వరద వెరసీ మణుగూరును నిండా ముంచాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 3 గంటల వరకు కురిసిన అతి భారీ వర్షంతో మణుగూరు పూర్తిగా ముంపునకు గురైంది. అర్ధరాత్రి వరద ఇంటిని చుట్టుముట్టడంతో సుందరయ్యనగర్, కుంకుడుచెట్ల గుంపు, వినాయకనగర్, మామిడిచెట్ల గుంపు, అశోక్‌నగర్, బాలాజీ నగర్, ఆదర్శ్‌నగర్, సురక్షాబస్టాండ్ ఒక్కసారిగా ముంపునకు గురయ్యాయి. పట్టణం నడిబొడ్డు నుంచి ప్రవహించే కట్టువాగు, మొట్టు వాగు తీవ్ర ఉధృతంగా ప్రవహించడంతో సుందరయ్యనగర్‌లోని దాదాపు అన్ని వీధుల్లోని ఇండ్లల్లో వరద నీరు చేరగా, పలురోడ్లు కొట్టుకుపోగా, ఇంట్లోని బియ్యం, నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు నీటమునిగాయి. పట్టణంలోని ప్రధాన రహదారి మొత్తం నీటితో నిండిపోగా రాత్రివేళ ఎక్కడికి వెళ్లలేని దుస్థితి నెలకొంది బిక్కుబిక్కుమంటూ రాత్రంతా గడిపారు. దీంతో సమాచారం అందుకున్న మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ మేడ ప్రసాద్, రంజిత్, తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు పట్టణంలో పర్యటించి ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించి లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు రావాలని పిలుపునిచ్చారు.

పరిస్థితిని పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ...

మణుగూరు ముంపునకు గురైన విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్, ఆర్డీఓలు మణుగూరులోని ముంపునకు గురైన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి అశోక్‌నగర్, సుందరయ్యనగర్‌లో ముంపునకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి సీఐ, ఎస్ఐలతో పాటు రెస్క్యూటీం, అగ్నిమాపక సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఉదయం 9 గంటల సమయంలో వరద తగ్గుముఖం పడుతుండటంతో అధికారులు స్థానిక అధికార బృందానికి ఆదేశాలిచ్చారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు...

అశోక్‌నగర్‌లోని ఎస్టీ బాలుర హాస్టల్ వద్ద 120 మంది విద్యార్థులు వరదలో చిక్కుకోగా, వారితో ఐటీడీఏ పీవో రాహుల్ ముంపు ప్రాంతం వద్ద విద్యార్థులతో వీడియో కాల్ మాట్లాడి తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పి అల్పాహారం పంపారు. అదేవిధంగా అటువైపే ముంపునకు చిక్కుకుపోయిన వ్యక్తులను కొండాయిగూడెం బోటు సిబ్బందిని పుట్టి ద్వారా కొందరు రాగా, మరికొందరిని ఎస్ఐ మేడ ప్రసాద్ భుజాలపై ఎక్కించుకుని ఎగువ ప్రాంతాలకు చేర్చి పునరావాస కేంద్రాలకు తరలించారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో వరద ముంపు తగ్గడంతో ఎస్టీ బాలుర హాస్టల్ వద్ద ఉన్న పిల్లలను పునరావాస కేంద్రాలకు సీఐ సతీశ్‌కుమార్ దగ్గరుండి తరలించారు.

దివ్యాంగుడి మృతి...

సుందరయ్యనగర్‌కి చెందిన వికలాంగుడు నందికోళ్ల రాము(30) వరదకు కదలలేని పరిస్థితిలో మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు బాధితుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

గోధుమ వాగు వరద ఉధృతిని పరిశీలించిన ఎస్పీ

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 1 : కొత్తగూడెం పరిసరాల్లో ఉన్న గోధుమ వాగు ఉధృతిని ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు ఆదివారం పరిశీలించారు. అక్కడి పరిస్థితుల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగూడెం-పెనుబల్లి ప్రాంతాలను కలుపుతూ ఉన్న చప్టా వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మడిపెల్లి నాగరాజు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ టి.రమేశ్ ఉన్నారు.

జలప్రళయం

ఖమ్మం సమీపంలోని మున్నేరు మహోగ్ర రూపం దాల్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వరద ప్రవాహం పోటెత్తింది. మున్నేరుపై ప్రకాశ్‌నగర్ వద్ద ఉన్న వంతెన పైనుంచి వరద ప్రవహించింది. ఈ వంతెనపై ఓ మహిళ సహా ఎనిమిదిమంది వ్యక్తులు చిక్కుకుపోయారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి దగ్గర సుమారు ఆరుగురు, వాల్యాతండా దగ్గర సుమారు పదిమంది, ఖమ్మం నగరంలోని మున్నేరు పరీవాహక డాబాల్లో సుమారు 50 మంది చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు విశాఖపట్నం నౌకాదళానికి చెందిన హెలికాప్టర్లను రప్పించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్యలు చేపట్టారు. వరద ఉధృతి కారణంగా ఖమ్మంలోని కరుణగిరి వద్ద మున్నేరు వంతెన కంపించింది. ప్రకాశ్‌నగర్ వంతన పైనుంచి వరద ప్రవహిస్తోంది. కాల్వొడ్డు వద్ద మున్నేటి బ్రిడ్జిపై ట్రాఫిక్‌ను అధికారులు బంద్ చేశారు. కరుణగిరి వంతెనపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. లారీలు సహా భారీ వాహనాలను అనుమతించడం లేదు. ఖమ్మం నగరంలోని సింహభాగం ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టులోని నివాస ప్రాంతాలు నీటమునిగాయి. ప్రధాన రహదారులపై కూడా భారీగా వర్షపు నీరు నిలిచింది. వరద ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో రాకపోకలను పూర్తిగా నిలుపుదల చేశారు. అయితే ఖమ్మం నగరం సహా జిల్లాలో జలదిగ్బంధంలో చిక్కుకున్న చాలామందిని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. ఖమ్మం నగరంలోని మున్నేరు పరీవాహక ప్రాంతాలన్నింటినీ వరద ముంచెత్తింది. పలు కాలనీల్లో అనేక ఇళ్లు మునిగిపోయాయి. బాధితులు డాబాలపైకి ఎక్కి హాహాకారాలు చేశారు. కొన్నిచోట్ల వాహనాలు కూడా పూర్తిగా నీటమునిగాయి. గోళ్లపాడు కాలువలోకి వర్షపు నీరు చేరడంతో మురుగుపోటెత్తింది. అదంతా స్థానిక ఇళ్లోలోకి చేరుకుంది. ముఖ్యంగా బొక్కలగడ్డ, మోతీనగర్, వెంకటేశ్వరనగర్, మాణిక్యనగర్, ధంసలాపురం, దానవాయిగూడెం, ప్రకాశనగర్, పంపింగ్‌వెల్ రోడ్డు, పెద్దమ్మతల్లి గుడి ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇళ్లలోకి మురుగునీరు, వరదనీరు చేరడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇంకొందరు కట్టుబట్టలతో ఇళ్లను వదిలి రోడ్లపైకి వచ్చారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా పంచాయతీలోని అనేక కాలనీలు వరదనీటిలో చిక్కుకోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలను బైపాస్‌రోడ్డులోని రాంలీలా ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. కాగా.. ఖమ్మం జిల్లాలో గరిష్ఠంగా 32 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. 51 వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి.

భద్రాద్రి జిల్లా అతలాకుతలం..

భారీ వర్షం ధాటికి భద్రాద్రి జిల్లా కూడా అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తెల్లవారేసరికి మణుగూరు పట్టణం చుట్టూ వరద చేరింది. జిల్లాలోని పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగులు పారుతున్నాయి. అశ్వాపురం మండలంలో వాగులో పడి ఇద్దరు గల్లంతయ్యారు చాలాసేపటి తరువాత వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. అదే మండలంలో 200 మేకలు, 30 ఎద్దులు మృతిచెందాయి. బూర్గంపహాడ్ మండలం కృష్ణసాగర్‌లో కూడా 30 ఆవులు మృత్యువాతపడ్డాయి. అలాగే సింగరేణికి భారీ నష్టం వాటిల్లింది. 40 వేల టన్నుల ఉత్పత్తికి ఆటంకం కలిగింది. వరద ఉధృతికి సీతారామ కాలువ కొట్టుకుపోయింది. ముంపు ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటించారు. వరద చుట్టుముట్టిన కారణంగా మణుగూరు సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన నందికొల్ల రాము మంచం మీదనే మృతిచెందాడు. ఆ ప్రాంతంలోని ఇళ్లలో ఉన్న సామగ్రి అంతా నీటిపాలైంది. కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్ వెంటనే ఇక్కడికి చేరుకొని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అశ్వాపురం మండలంలో చింత కుంట చెరువు తెగిపోవడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. టేకులపల్లిలో గుండాలకు వెళ్లే రహదారి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాగు పక్కనే ఓ రైతు తన ఎద్దులను కట్టేయడంతో వాగు పొంగిన కారణంగా అవి అక్కడికక్కడే మృతిచెందాయి. చర్ల మండల తాలిపేరు ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లు ఎత్తి 40 వేల క్యూసెక్కుల నీటిని, పాల్వంచ కిన్నెరసానిలో 12 గేట్లు ఎత్తి 1,04,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కిన్నెరసాని-ఉల్వనూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అంగన్‌వాడీ కేంద్రంలోకి చేరడంతో వంటసామగ్రి తడిసిపోయింది. గుడ్లు నీటిపాలయ్యాయి. అశ్వారావుపేట మండలం పెదవాగు ప్రాజెక్టుకు ఇటీవల వేసిన రింగ్‌బండ్ మళ్లీ కొట్టుకుపోయింది. అయితే, ములకలపల్లి మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే ప్రారంభించిన సీతారామ పంపుహౌస్‌ను ప్రారంభించగా.. దానికి సంబంధించిన కాలువకు గండి పడింది. గండి పడిన ప్రాంతం నుంచి వరద నీరు దిగువకు ప్రవహించగా అక్కడ సుమారు 20 వేల ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. అలాగే, పాల్వంచ మండలం బంద్రిగొండ వద్ద కూడా సీతారామ కాలువకు గండి పడింది. ఇక్కడ కూడా సుమారు 30 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో సింగరేణి సంస్థకూ భారీ నష్టం వాటిల్లింది. ఇల్లెందు, టేకులపల్లి, రుద్రంపూర్, మణుగూరు ఏరియాల్లో సుమారు 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఓబీ పనులు నిలిచిపోయాయి. మహబూబాబాద్ వద్ద రైలు ట్రాక్ దెబ్బతినడంతో కొత్తగూడెం నుంచి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం వద్ద గోదావరి రాత్రి 8గంటలకు 30.2 అడుగుల వద్ద ప్రవహిస్తోంది.

ఆకేరు ఉధృతికి మునిగిన రాకాసితండా..

తిరుమలాయపాలెం మండలంలోనూ గతంలో ఎన్నడూలేని విధంగా భారీ వర్షం కురిసింది. కేశ్వాపురం-తిప్పారెడ్డిగూడెం, మేడిదపల్లి-సుబ్లేడు, బచ్చోడు-బీరోలు, గోల్‌తండా-పాతర్లపాడు ప్రాంతాల్లో వాగులు పొంగిపొర్లుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బీరోలు పెద్ద చెరువు, ఊర చెరువులకు గండిపడి పంటలు కొట్టుకుపోయాయి. బంధంపల్లి ఎస్సీ కాలనీ మునిగిపోయింది. కాకరవాయిలో

రాళ్లవాగు వద్ద కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

రెండు కోళ్లఫారాలు మునిగి కోళ్లు చనిపోయాయి. సుబ్లేడు, కొక్కిరేణి ప్రాంతాల్లో బీటీ రోడ్లు కోతకు గురిఅయ్యాయి. ఆకేరు ఉధృతంగా ప్రవహించడంతో రాకాసితండా నీట మునిగిపోయింది. ఆదివారం తెల్లారుజామున 4 గంటలకే తండావాసులు ప్రాణాలు అరచేతిలో పట్టుకొని గుట్టలు, డాబాలు ఎక్కి ఆర్తనాదాలు చేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, ఏసీపీ తిరుపతి రెడ్డి, తహసీల్దారు రామకృష్ణ, ఎస్ఐ జగదీశ్, ఎంపీడీవో సిలార్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించారు. పడవల ద్వారా వారిని రక్షించారు. 80 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. ఆకేరు ఉధృతి వల్ల దానిపై ఉన్న బ్రిడ్జీలు మునిగిపోయాయి. బీచరాజుపల్లి, బాలాజీనగర్ గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించింది. ఆకేరు ఒడ్డున ఉన్న విద్యుత్ మోటార్లు, పైపులు కొట్టుకుపోయాయి. పంటల్లో ఇసుక మేటలు వేసింది. స్తంభాలు, చెట్లు కూలిపోయాయి.

'పాలేరు'కు వరద పోటు

పాలేరు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రిజర్వాయర్‌కు వరద పోటెత్తడంతో రాత్రికి రాత్రే ఒక్కసారిగా పాలేరు ఉగ్ర రూపం దాల్చింది. ప్రజలు కట్టుబట్టలతో ఇళ్లు వదిలివెళ్లారు. నాయకన్‌గూడెంలో గుడి సమీపంలో ఇటుకలు తయారు చేస్తున్న కుటుంబం వరదలో చిక్కుకుంది. వారిలో ఒక్కరిని ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు కాపాడారు. మరో ఇద్దరు కొట్టుకొని పోగా వారి ఆచూకీ లభ్యం కాలేదు. పెట్రోల్‌బంక్‌లో చిక్కుకున్న వ్యక్తిని మత్స్యకారులు, అధికారులు కాపాడారు. పరిస్థితి గురించి మంత్రి పొంగులేటి ఆరా తీశారు. కూసుమంచిలో రికార్డుస్థాయిలో 320 మీల్లీమీటర్ల వర్షం కురిసింది. పాలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా 28 అడుగులకు పైగా నీరు వచ్చి చేరింది. సుమారు 70 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్లింది. మినీ హైడల్ ప్రాజెక్టు పూర్తిగా నీట మునిగింది.

ఆరు గంటలపాటు హాహాకారాలు..

నాయకన్‌గూడెం వద్ద పాలేరు అలుగుల నుంచి వరద పోటెత్తి ఒక్కసారిగా ఇంటిని చుట్టుముట్టడంతో యూకూబ్, సైదాబీ దంపతులు, వారి కుమారుడు షరీఫ్ వెంటనే ఇంటి పైకి ఎక్కారు. సహాయం కోసం హాహాకారాలు చేశారు. కలెక్టర్, ఏసీపీ వచ్చి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను పంపారు. ఫలితం లేకపోవడంతో హెలికాప్టర్ తెప్పించేందుకు ప్రయత్నాలు చేశారు. వాతావరణం అనుకూలించకపోవడంతో స్వయంగా కలెక్టర్, ఏసీపీ కలిసి వారితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. రహదారిపైకి వరదనీరు చేరడంతో ఖమ్మం-హైదరాబాద్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కలెక్టర్, ఏసీపీ, ఎన్‌డీఆర్‌ఎస్ సభ్యులు సూర్యాపేట-కోదాడ మీదుగా ఖమ్మం చేరుకున్నారు.

డ్రోన్ సహాయంతో లైఫ్ జాకెట్లు..

నాయకన్‌గూడెంలో ఇంటిపై చిక్కుకున్న ముగ్గురిని రక్షించేందుకు వ్యవసాయ డ్రోన్ సహాయంతో అధికారులు వారికి లైఫ్ జాకెట్లు పంపారు. బాధితులు వాటిని ధరించారు. ఈ క్రమంలో వరద పెరిగిన కారణంగా ఇల్లు కూలిపోవడంతో వారు నీటిలో కొట్టుకుపోయారు. వారిలో షరీఫ్ మూడు కొట్టుకొనిపోయి హైవే వద్ద నీటిపై తేలడంతో మత్స్యకారులు కాపాడారు. సైదాబీ, యాకూబ్ కళ్లెదుటే కొట్టుకొనిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. లైఫ్ జాకెట్లు ఉన్నందున ఎక్కడో ఒకచోట సురక్షింతంగా ఉంటారని భావించి డ్రోన్ కెమెరాలతో గాలిస్తున్నారు.

పాలేరు కాలువకు గండి..

పాలేరు ప్రధాన కాలువకు పాలేరు మినీ హైడెల్ వద్ద పెద్ద కాలువకు ఒకటో గండి, హట్యాతండా వద్ద రెండో గండి పడ్డాయి. దీంతో హట్యాతండా వాసులు తండాను ఖాళీ చేసి బయటకు వెళ్లారు. వరద నీరు రావడంతో పాలేరు జలాశయం సముద్రాన్ని తలపిస్తోంది. ఖమ్మం నుంచి సూర్యాపేట వెళ్లాల్సిన వారు కోదాడ మీదుగా ప్రయాణం చేస్తున్నారు. వందలాది వాహనాలు రోడ్ల పక్కన నిలిచిపోయారు. కూసుమంచి మండలంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా 20కి పైగా గ్రామాల్లోకి వరద నీరు వచ్చింది. కొన్ని గ్రామాల్లోని ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాల్లోకి తరలించారు.

ఇద్దరు పశువుల కాపర్ల మృతదేహాలు లభ్యం..

అశ్వాపురం మండలం వెంకటాపురంలోని తోగువాగు ఉప్పొంగడంతో వాగు ఒడ్డున ఉన్న తాటి ఆదెమ్మ(70)తో పాటు ఆమెకు చెందిన 200 మేకలు వాగులో కొట్టుకుపోయాయి. అదే వాగు ఒడ్డున నివాసం ఉంటున్న మరో వ్యక్తి కల్లూరి నీలమయ్య (60)తోపాటు అతడికి చెందిన 30 పశువులు గల్లంతయ్యాయి. స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం వారి మృతదేహాలు వాగు ఒడ్డున కొంతదూరంలో చెట్ల వద్ద లభించాయి. అదే వాగు ఒడ్డున మేకలు, పశువులు మృతిచెంది చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇదే మండలంలోని పలు గ్రామాల్లోని ఇళ్లను, పంటలను వరద ముంచెత్తింది. నెల్లిపాక సొసైటీ కార్యాలయంలోకి ఒక్కసారిగా వరదనీరు చేరడంతో రూ.3 లక్షల విలువైన ఎరువులు నీటమునిగాయి.

హెలికాప్టర్ల కోసం 'భట్టి' చర్యలు..

జిల్లాలో మున్నేరు ఉధృతిలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ పంపించాలని సీఎస్ శాంతికుమారిని ఫోన్‌లో ఆదేశించారు. హైదరాబాద్‌లో వర్షాల కారణంగా వాతావరణం అనుకూలించడం లేదు. దీంతో విశాఖపట్నం నౌకాదళ అధికారులతో చర్చించారు. ఖమ్మానికి హెలికాప్టర్‌ను పంపించాలని కోరారు. కలెక్టర్ ముజ్జమ్మిల్ ఖాన్ ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారు.

సాయం చేయండి మహోప్రభో..

'సాయం చేయండి మహోప్రభో..' అంటూ ఖమ్మం మున్నేటి పరీవాహక ప్రాంతాల ప్రజల ఆర్తనాదాలు చేస్తున్నారు. తాము ఇంతటి ఆపదలో ఉంటే జిల్లాలోని ముగ్గురు మంత్రుల్లో కనీసం ఒక్కరూ వచ్చి ఇటు చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యంత భారీ వర్షాలుంటాయని ఐఎండీ అధికారులు నాలుగురోజుల క్రితమే స్పష్టం చేసినా ప్రభుత్వంగానీ, యంత్రాంగంగానీ ముందస్తు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని విపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. మున్నేటికి ఇరువైపులా చిక్కుకున్న ప్రజలను బయటకు తీసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలేమీ చేయలేదని ధ్వజమెత్తారు. సాయంత్రం చూసిన బాధితులు.. చివరికి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, మంచికంటినగర్ తదితర కాలనీల్లో దాదాపుగా 40 మంది వరకు ఇళ్లపైకి ఆర్తనాదాలు చేశారు. ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై మరో ఆరుగురు, పోలేపల్లి సమీపంలో ఏడుగురు వరదనీటిలో చిక్కుకుపోయారు.